సాక్షి ఖమ్మం

బుధవారం । 17 । ఏప్రిల్ । 2024



పకడ్బందీగా ఏర్పాట్లు

నామినేషన్ల స్వీకరణకు కలెక్టరేట్‌లోని ఆర్‌ఓ కార్యాలయంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. IIలో



డీజిల్ ట్యాంకర్ బోల్తా..

సత్తుపల్లిలో డీజిల్‌తో వెళ్తున్న ట్యాంకర్ బోల్తా పడగా.. ప్రమాదం జరగకుండా ఐదు గంటల పాటు రెస్క్యూ చేపట్టారు. IIలో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 41° / 25°

జిల్లాలో బుధవారం ఉదయం నుంచే ఎండ మొదలవుతుంది. మధ్యాహ్నానికి గరిష్ట స్థాయికి చేరడంతో పాటు వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జమలాపురం ఆలయంలో పుష్పయాగం



పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జరుగుతున్న వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఎనిమిదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అర్చకులు 11 రకాల పుష్పాలతో పుష్పయాగం నిర్వహించారు. అలాగే, నిత్యకల్యాణం, గరుడ వాహనంపై గిరిప్రదక్షణ చేయించగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్ర మూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, అర్చకులు ఉప్పల విజయదేవశర్మ, మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి పాల్గొన్నారు.

భద్రగిరి భక్తులకు లక్ష మజ్జిగ ప్యాకెట్లు

ఖమ్మంవ్యవసాయం: భద్రాచలంలో బుధవారం జరిగే శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవ వేడుకలకు లక్షలాది మంది భక్తులు హాజరుకానున్నారు. ఎండ తీవ్రంగా ఉన్న నేపథ్యాన అధికారుల సూచనతో 200 మి.లీ మజ్జిగ ప్యాకెట్ రూ.10 చొప్పున ఖమ్మం విజయ డెయిరీ ద్వారా లక్ష ప్యాకెట్లు సరఫరా చేశారు. కానీ ఖమ్మం యూనిట్‌లో నిర్దేశించిన మేరకు మజ్జిగ లభ్యత లేకపోవడంతో హైదరాబాద్ నుంచి 70 వేల ప్యాకెట్లు, వరంగల్ నుంచి 15 వేల ప్యాకెట్లు సమకూర్చుకున్నారు. వీటికి తోడు ఖమ్మం యూనిట్ నుంచి 15 వేల ప్యాకెట్లను మంగళవారం భద్రాచలం పంపించామని డెయిరీ డీడీ ధన్‌రాజ్ తెలిపారు.

21న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి అండర్–14, 16, 18, 20 బాలబాలికలు, మహిళలు, పురుషుల అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. 100, 600, 400, 800, 1,500, 2వేలు, 3వేలు, 5వేల మీటర్ల పరుగు పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారిని సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయస్సు ధృవీకరణ, ఆధార్ కార్డుతో ఉదయం 8 గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు.

హెచ్‌సీఏ ఆధ్వర్యాన ఉచిత క్రికెట్ శిక్షణ

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) సౌజన్యంతో ఖమ్మంలోని పటేల్ స్టేడియం, కొత్తగూడెంలోని గౌతంపూర్ మైదానంలో ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. భద్రాద్రి జిల్లా బాలబాలికలు www.hydcricket Asssociation (HCA) వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని, ఖమ్మం జిల్లాకు సంబంధించి వివరాల కోసం నెట్స్ మేనేజర్ ఎం.డీ.ఫారూఖ్‌ను సంప్రదించాలని జిల్లా కార్యదర్శి, కోఆర్డినేటర్ చేకూరి వెంకట్, ఎం.డీ.మసూద్‌పాషా తెలిపారు. వివరాల కోసం 98486 62125 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జిల్లాకు ఇంకో ట్రైనీ ఐఏఎస్



మ్రినాల్ శ్రేష్ఠ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ట్రైనీ(అసిస్టెంట్) కలెక్టర్‌గా బీహార్ రాష్ట్రానికి చెందిన మ్రినాల్ శ్రేష్ఠ నియమితులయ్యారు. 2023 బ్యాచ్‌కు చెందిన ఆయనను ఏడాది పాటు శిక్షణ నిమిత్తం జిల్లాకు కేటాయించారు. కాగా, ఇప్పటికే మయాంక్‌సింగ్, యువరాజ్ అసిస్టెంట్ కలెక్టర్లుగా ఇక్కడ ఉన్నారు. వీరిలో మయాంక్ కాలపరిమితి ముగియనుండడంతో మ్రినాల్‌ను కేటాయించినట్లు తెలిసింది.

25నుంచి 'ఓపెన్' పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలు ఈనెల 25వ తేదీ నుంచి మే 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఆర్వో రాజేశ్వరి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మంగళవారం విద్యాశాఖాధికారులతో సమీక్షించారు. పదో తరగతి విద్యార్థులు 955మందికి ఐదు, ఇంటర్ విద్యార్థులు 1,108మంది కోసం ఐదు కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అలాగే, ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు మే 5 నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లుచేయాలని సూచించారు. డీఈఓ సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పాపారావు, ఏఓ అరుణ పాల్గొన్నారు.

భద్రగిరికి కల్యాణ శోభ

భద్రాచలంలో నేడు సీతారాముల కల్యాణం

- పల్లకీలో ఆలయం నుంచి మిథిలా స్టేడియానికి..
- ఉదయం 10 గంటలకు కల్యాణ క్రతువు ప్రారంభం
- సింహాసనంపై శ్రీరాముడు, గజాసనంపై సీతమ్మ తల్లి
- రామదాసు ఆభరణాలతో వధూవరుల అలంకరణ
- మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నంలో జీలకర్ర బెల్లం



ఎదుర్కోలు వేడుక సందర్భంగా రాముల వారి వంశ గొప్పదనాన్ని వివరిస్తున్న అర్చకులు, చిత్రంలో సీఎస్ శాంతికుమారి, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు తదితరులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: శ్రీరామ నవమి రోజున ఆగమ శాస్త్ర పద్ధతిని అనుసరిస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వేలాది ఆలయాలు, మండపాల్లో సీతారాముల కల్యాణం నిర్వహిస్తుంటారు. వేలాది వేదికల్లో సీతారాముల కల్యాణం జరిగినా.. అందులో ప్రత్యేకమైనది, విశిష్టమైనది భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో నేడు జరగనున్న వేడుక. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి కాగా, భద్రగిరి కల్యాణ శోభను సంతరించుకుంది.

▸▸ ఏడడుగుల వేడుక ఇలా..

ఉదయం 9:30 గంటల తర్వాత జనక మహారాజు పుత్రిక సీతమ్మ వారు, దశరథ మహారాజు జ్యేష్ఠ పుత్రుడు రామచంద్రస్వామి వివాహవేడుక పనులు ప్రారంభమవుతాయి. శంకు, చక్ర, ధనుర్బాణాలను ధరించి సీతమ్మతో కూడిన రాముడి ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి పల్లకీలో తీసుకొచ్చి మిథిలా స్టేడియంలోని వేదికపై వేంచేపు చేస్తారు. కల్యాణ వేడుకలకు ఎలాంటి విఘ్నాలు రాకుండా విశ్వక్సేన పూజ నిర్వహిస్తారు. పుణ్యావాచన మంత్రాలను పఠిస్తూ కల్యాణానికి ఉపయోగించే స్థలం, వస్తువులు, ప్రాంగణాన్ని సంప్రోక్షణ చేస్తారు. వేడుకలో పాల్గొనే వారిని మంత్ర జలంతో శుద్ధి చేస్తారు.

▸▸ రాముడి ఎదురుగా సీతమ్మ

శ్రీయోద్వాహము నిర్వహించి అప్పటి వరకు మండపంలోనే ఉన్న సీతమ్మను శ్రీరాముడికి ఎదురుగా కూర్చుండబెడతారు. అర్చకులు సీతారాముల వంశగోత్రాల ప్రవరలు చదువుతారు. ఆ తర్వాత ద్వాదశ దర్భలతో తయారు చేసిన యోక్త్రంతో సీతమ్మకు బంధనం చేస్తారు. మరోవైపు శ్రీరాముడు గృహస్థ ఆశ్రమంలోకి వెళ్తున్నాడనే దానికి సూచనగా యజ్ఞోపవీతధారణ చేస్తారు. ఈ కార్యక్రమాల అనంతరం శ్రీరాముడికి పాదప్రక్షాళణ చేసి, వర పూజ నిర్వహిస్తారు.

▸▸ రామదాసు చేయించిన ఆభరణాలతో..

కల్యాణం కోసం ప్రత్యేకంగా తయారు చేసిన వస్త్రాలను సీతారాములకు ధరింపజేస్తారు. అనంతరం రామదాసు చేయించిన చింతాకు పతకం సీతమ్మకు, పచ్చలహారం రామయ్యకు అలంకరిస్తారు. లక్ష్మణుడికి రామమాడ ధరింపజేస్తారు. ఆ తర్వాత సీతారాములకు తేనే, పెరుగు కలిపిన మధుపర్కంతో నివేదన చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం, శృంగేరీ పీఠం, రామదాసు, తూము నర్సింహదాసు వంశీయుల తరఫున పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.

▸▸ కన్యాదానం..

వేదమంత్రాలు పఠిస్తూ కన్యాదానాన్ని పురస్కరించుకుని భూ, గోదానం చేస్తారు. అనంతరం మహాసంకల్పం, చూర్ణిక పఠిస్తారు. శ్రీరాముడు, సీతమ్మలకు సంబంధించి చెరో ఎనిమిది శ్లోకాలను పఠిస్తారు. మంగళాష్టకాల్లో వధూవరులకు సంబంధించి ఏడు తరాల వివరాలు, ఘనతను తెలియజేస్తారు.

▸▸ అభిజిత్ లగ్నంలో..

చైత్రశుద్ధ నవమి రోజున అభిజిత్ లగ్నంలో శ్రీరాముడి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. మధ్యాహ్నం 12 గంటలకు ముహూర్త సమయం కాగానే సీతారాముల తలలపై జీలకర్ర, బెల్లం ఉంచుతారు. తర్వాత రామదాసు చేయించిన మూడు బొట్ల మంగళసూత్రానికి ప్రత్యేకపూజలు చేసి, సీతమ్మ వారి మెడలో వేస్తారు.



మాలమార్పిడి నృత్యం చేస్తున్న అర్చకులు

▸▸ తలంబ్రాల వేడుక..

ముత్యాలు కలిపిన, భక్తులు గోటితో ఒలిచిన తలంబ్రాలను సీతారాములపై పోస్తారు. సాధారణంగా తలంబ్రాలు పసుపు రంగులో ఉంటాయి. కానీ ఇక్కడ గులాబీ రంగులో ఉంటాయి. ఇక్కడ తలంబ్రాల తయారీలో పసుపుతో పాటు గులాల్‌ను కూడా ఉపయోగించడం తానీషా కాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది.

అలరించిన 'ఎదుర్కోలు'

భద్రాచలం: శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో కీలక ఘట్టమైన ఎదుర్కోలు వేడుక మంగళవారం ఆద్యంతం ఆసక్తిగా సాగింది. గరుత్మంతుడి వాహనంపై స్వామివారిని మిథిలా స్టేడియం ఎదురుగా ఉన్న వైకుంఠద్వారం వద్దకు తీసుకొచ్చి కొలువుదీర్చారు. అక్కడ 'మా వంశం గొప్పదంటే.. కాదు మా వంశమే గొప్ప' అంటూ కొందరు అర్చకులు సీతమ్మ తరఫున, మరి కొందరు రామయ్య వైపు చేరి సంవాదం చేసుకోవడం రక్తి కట్టించింది. శ్రీ సీతారాముల వారి వైభవాన్ని లోకానికి తెలియజెప్పేందుకే ఎదుర్కోలు వేడుక నిర్వహిస్తామని పండితులు తెలిపారు. ఆ తర్వాత ఊరేగింపుగా స్వామి, అమ్మవార్లను ఆలయానికి తీసుకెళ్లారు. కాగా రామచంద్రస్వామి తరఫున దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, సీతమ్మ వారి తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ రోహిత్‌రాజ్, ఈఓ రమాదేవి, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, ప్రధాన అర్చకులు విజయరాఘవన్, పొడిచేటి సీతారామానుజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



ఎదుర్కోలు వేడుకకు హాజరైన భక్తులు

మొదటి కల్యాణం గర్భగుడిలో...

- రెండు గంటలకే పూజాదికాలు ప్రారంభం
- ఉదయం 8 గంటలకు లఘు కల్యాణం
- ఆ రోజుల్లో పొగడ చెట్టు నీడన.. ఇప్పుడు మిథిలా స్టేడియంలో

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సాధారణ రోజుల్లో తెల్లవారుజామున నాలుగు గంటల తర్వాత ఆలయంలో భద్రాచలంలో శ్రీరాముడిని సుప్రభాతంతో మేల్కొలుపుతారు. ఆ తర్వాత తిరువారాధన, మంగళశాసనం, అభిషేకం తదితర పూజాదికాలు నిర్వహిస్తారు. కానీ శ్రీరామ నవమి రోజున సీతారాముల వారిని రాత్రి రెండు గంటలకే మేల్కొల్పుతారు. ఆ తర్వాత నిత్యం నిర్వహించే పూజా కార్యక్రమాలు చేపడతారు. అనంతరం ఉదయం ఎనిమిది గంటల సమయాన గర్భగుడిలో ఉన్న మూల విరాట్‌లకు శాస్త్రోక్తంగా లఘు కల్యాణం జరుపుతారు. 40 నిమిషాల వ్యవధిలోనే ఈ పెళ్లి తంతు ముగుస్తుంది.

▸▸ పెళ్లి పెద్దలుగా

శ్రీరామదాసు కాలం నుంచి భద్రాచలంలో నిత్య పూజలు, శ్రీరామనవమి, పట్టాభిషేకం తదితర వేడుకలు నిర్వహించేందుకు తమిళనాడులోని శ్రీరంగానికి చెందిన వేద పండితులను శ్రీరామదాసు భద్రాచలం తీసుకొచ్చారు. ఇలా వచ్చిన వారిలో కోటి, అమరవాది, పొడిచేటి, గొట్టుపుళ్ల, తూరుబాటి కుటుంబాలు ఉన్నాయి. అప్పటి నుంచి నేటి వరకు వంశపారంపర్యంగా వీళ్లే ఈ బాధ్యతలు నిర్వర్తిస్తూ వస్తున్నారు. ఇందులో నవమి వేడుకల బాధ్యతలను వంతుల వారీగా ఈ కుటుంబాలు నిర్వహిస్తుంటాయి. శ్రీరామ నవమికి మిథిలా స్టేడియంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాల్లో కీలక పాత్ర పోషించేది ఆచార్య. ఈయన చేతుల మీదుగానే కల్యాణం మొత్తం జరుగుతుంది. ఆయనకు సూచనలు చేసే వ్యక్తిని బ్రహ్మగా పేర్కొంటారు. వీరిద్దరికి సహాయకులుగా ఇద్దరు చొప్పున నలుగురు రుత్వికులు ఉంటారు. వీరికి పూజా సామగ్రి అందించేందుకు ఇద్దరు చొప్పున నలుగురు పరిచారకులు ఉంటారు. ప్రస్తుతం ఆలయంలో ప్రధాన అర్చకులైన ఇద్దరు వీరందరికీ ఆధ్వర్యులుగా వ్యవహరిస్తారు. మొత్తంగా పన్నెండు మంది సీతారాముల పెళ్లి వేడుకలో కీలకంగా వ్యవహరిస్తారు. వీరందరిని ఉత్సవాల్లో భాగస్వామ్యం చేస్తూ ఈ కళ్యాణ తంతు శాస్త్రోక్తంగా, సంప్రదాయ బద్ధంగా పూర్తి చేసేలా స్థానాచార్యులు స్థలశాయి 'పెద్ద పాత్ర' నిర్వర్తిస్తారు.



నాడు పొగడ చెట్టు నీడలో

శ్రీరామదాసు కాలంలో భద్రాచలం ఆలయం ప్రాంగణంలో ఉన్న పొగడ చెట్టు నీడలో సీతారాముల కల్యాణం నిర్వహించేవారని పండితులు చెబుతారు. ఆ తర్వాత కాలంలో భక్తుల సంఖ్య పెరగడంతో పొగడ చెట్టు నుంచి బేడా మండపంలోకి పెళ్లి వేదికను మార్చారు. గోదావరిపై వంతెన నిర్మాణం పూర్తయ్యాక భద్రాచలం వచ్చే భక్తుల సంఖ్య వేలల్లోకి చేరింది. బేడా మండపంలో అంత మంది పెళ్లి చూడటం కష్టం కావడంతో ఆలయ ప్రాంగణం బయట కల్యాణం జరిపించాలని నిర్ణయించారు. దీంతో ఉత్తర ద్వారానికి ఎదురుగా నవమి కల్యాణం కోసం ప్రత్యేకంగా మండపాన్ని 1964లో నిర్మించారు. సుమారు రెండు దశాబ్దాల పాటు ఎత్తయిన కల్యాణ మండపంలో పెళ్లి తంతు జరుగుతుంటే చుట్టూ భక్తులు చేరి చూసేవారు. ఆ తర్వాత ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయాన 1988లో కల్యాణ మండపం చుట్టూ భక్తులు కూర్చుని చూసేందుకు వీలుగా మిథిలా స్టేడియాన్ని నిర్మించారు.

నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి

- రేపటి నుంచి 25వరకు స్వీకరణ
- అభ్యర్థులకు సహకరించేలా హెల్ప్‌డెస్క్
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. సీపీ సునీల్‌దత్‌తో కలిసి కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు సమర్పించొచ్చని తెలిపారు. ఈనెల 21న ఆదివారం సెలవు మినహా మిగతా ఏడు రోజుల్లో నామినేషన్లు దాఖలు చేయవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలను సరిగా నింపారో, లేదో చూసుకునేందుకు హెల్ప్‌డెస్క్‌లు కూడా ఏర్పాటు చేశామని, అఫిడవిట్‌లో వివరాలన్నీ నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ చివరిరోజు జనరల్ అబ్జర్వర్ వస్తారని కలెక్టర్ వెల్లడించారు. నామినేషన్ల ప్రక్రియ సీసీ కెమెరాల పర్యవేక్షణలో కొనసాగుతుందని, ఈసీఐకి లైవ్ కాస్టింగ్ అవుతుందని తెలిపారు. ఇక 26న స్క్రూటినీ చేపట్టి, 29వరకు ఉపసంహరణకు అవకాశం ఇస్తామని వెల్లడించారు. కాగా, ఈనెల 25న తుది ఓటర్ల జాబితా వెల్లడించనుండగా.. ఆ జాబితా ఆధారంగా ఓటు వేసేందుకు అవకాశముంటుందని తెలిపారు. సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ నామినేషన్లు వేయడానికి వచ్చే అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని సూచించారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల అవతల వాహనాలను నిలిపేస్తామని, అభ్యర్థితోపాటు నామినేషన్ వేసే వారికి సంబంధించి మూడు వాహనాలనే అనుమతిస్తామని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 102 కేసులు నమోదు చేయగా, రూ.1.12 కోట్లు సీజ్ చేశామని చెప్పారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, మ్రినాల్ శ్రేష్ఠ, డీపీఆర్ ఎంఏ.గౌస్, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, మదన్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ సునీల్‌దత్

పరాజయం ఎదురైనా వెనక్కి తగ్గొద్దు

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: క్రీడల్లో జయాపజయాలు సహజమేనని.. పరాజయం ఎదురైనప్పుడు కుంగిపోకుండా పట్టుదలతో ముందుకు సాగితే విజయం సొంతమవుతుందని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కూసుమంచి మండలం జీళ్లచెరువులో శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం సందర్భంగా పొంగులేటి యువసేన ఆధ్వర్యాన నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. చివరి మ్యాచ్‌ను మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. క్రీడాస్ఫూర్తిని చాటుతూ ముందుకు సాగితే అన్ని రంగాల్లో గెలుపు సాధ్యమవుతుందని తెలిపారు. ఆతర్వాత కాసేపు తన సోదరుడు ప్రసాదరెడ్డితో కలిసి మంత్రి మ్యాచ్‌ను వీక్షించి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. పోటీల నిర్వాహకులు ముద్రబోయిన సత్యనారాయణ, అయితగాని నాగేశ్వరరావు, మొక్కా ఉపేందర్, మద్దెల ఉపేందర్, కొండా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, ప్రసాదరెడ్డి

ఐఏఎస్ కావాలనేదే జీవిత లక్ష్యం

- ముందుకు నడిపించిన తండ్రి ప్రోత్సాహం..
- నాలుగు సార్లు విఫలమైనా అలుపెరగకుండా ప్రయత్నం
- సివిల్స్‌లో 938 ర్యాంకు సాధించిన గోవిందాపురం(ఎల్) వాసి అలేఖ్య

బోనకల్: తండ్రి ప్రోత్సాహానికి తోడు అపజయాలు ఎదురైనా వెనుదిరగని పట్టుదల ఆమెను విజేతగా నిలబెట్టింది. సివిల్స్‌లో నాలుగు పర్యాయాలు విజయం దరి చేరకున్నా కుంగిపోకుండా మరింత శ్రద్ధగా సిద్ధం కావడంతో బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన రావూరి అలేఖ్య ఐదో పర్యాయం 938వ ర్యాంకు సాధించింది. బుధవారం యూపీఎస్సీ విడుదల చేసిన ఫలితాల్లో ఆమె ర్యాంకు సాధించినట్లు వెల్లడి కాగా స్వగ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

కానిస్టేబుల్ కుమార్తె



రావూరి అలేఖ్య

గోవిందాపురం(ఎల్)కు చెందిన రావూరి ప్రకాశరావు మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రకాశ్‌రావు – పద్మశ్రీ దంపతుల కుమార్తె అలేఖ్య ప్రాథమిక విద్య ఖమ్మంలోని త్రివేణి స్కూల్, తల్లాడ, నేలకొండపల్లి, కొత్తూరులోని ప్రైవేట్ స్కూళ్లలో పూర్తిచేశారు. తండ్రి ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో చదివిన ఆమె ఇంటర్మీడియట్ విజయవాడలోని శ్రీచైతన్య కాలేజీలో, ఉస్మానియా యూనివర్సిటీ బీఏ పూర్తిచేశాక వారణాసిలోని బెనారస్ యూనివర్సిటీ నుంచి రూరల్ డెవలప్‌మెంట్‌లో పీజీ చదివి గోల్డ్‌మెడల్ సాధించింది. అనంతరం హైదరాబాద్‌లోని సీఎస్‌బీలో సివిల్స్ కోచింగ్ తీసుకుంది. అలేఖ్యకు నాలుగు పర్యాయాలు విజయం దక్కలేదు. అయితే, ఆమెను తండ్రి ప్రకాశ్‌రావు అడుగడుగునా ప్రోత్సహించడంతో పాటు ఐఏఎస్ కావాలనే చిన్నప్పటి లక్ష్యం, పేదలకు సేవ చేయాలనే తపనతో మరింత పట్టుదలతో సిద్ధమై 938వ ర్యాంకు సాధించింది. కాగా, అలేఖ్యకు ఎస్టీ కేటగిరిలో ఐపీఎస్ వచ్చే అవకాశముందని తెలిసింది. కాగా, ఆమెను ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, బోనకల్ ఎస్సై మధుబాబు తదితరులు అభినందించారు.



తల్లిదండ్రులు, సీఎస్‌బీ డైరెక్టర్‌తో అలేఖ్య (కుడి చివర)

ఆర్టీసీకి ఆదాయం అదుర్స్!

ఈనెల 15వ తేదీన రూ.1.50 కోట్ల రాబడి

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరుగుతుండడంతో సంస్థకు అదే స్థాయిలో ఆదాయం సమకూరుతోంది. రద్దీ ఆధారంగా అధికారులు సర్వీసులు నడిపిస్తుండడం కలిసొస్తోంది. ఈనెల 15వ తేదీ సోమవారం ఒకేరోజు ఖమ్మం రీజియన్ నుండి సంస్థకు రూ.1,50,94,737 ఆదాయం సమకూరింది. ఎండల తీవ్రత అధికంగా ఉన్నా శుభకార్యాలు, ఇతర పనుల కోసం ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుండడం ఆదాయం పెరగడానికి కారణంగా చెబుతున్నారు. ఈనెల 4వ తేదీన ఖమ్మం రీజియన్ నుండి సంస్థకు రూ.1.35 కోట్లు ఆదాయం రాగా, సోమవారం అంతకుమించి రూ.1.50 కోట్లకు పైగా రావడం విశేషం.



డిపోల వారీగా ఈనెల 15న నమోదైన ఆదాయం (రూ.ల్లో)

డిపో	ఆదాయం
ఖమ్మం	40,07,094
భద్రాచలం	29,04,350
సత్తుపల్లి	26,60,958
మణుగూరు	19,68,628
కొత్తగూడెం	15,98,245
మధిర	15,73,989
ఇల్లెందు	3,81,473

క్లుప్తంగా

న్యాయవాద సొసైటీ డైరెక్టర్ల ఎన్నిక



ఎన్నికల్లో గెలిచిన డైరెక్టర్లు

ఖమ్మం లీగల్: ఖమ్మం న్యాయవాద సహకార సంఘంలోని నాలుగు డైరెక్టర్ పదవులకు మంగళవారం నిర్వహించిన ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 472 మందికి గాను 380 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా, పలివెల శ్రీలక్ష్మి 292 ఓట్లు, అనుముల నర్సింహారావు 242, భూక్యా రమేష్ 219, దేవకి శ్రీనివాసరావు 208 ఓట్లు సాధించడంతో డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. అనంతరం సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాసర్ల రాజుశేఖరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ రఫీ, ప్రధాన కార్యదర్శిగా నోముల వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా పిడతల రామ్మూర్తి, కోశాధికారిగా యాసా కాంతి కుమారి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జి.రమేష్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి కె.రవికుమార్ ప్రకటించారు.

విద్యుత్ ఉద్యోగుల నూతన కార్యవర్గాలు



సమావేశంలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు

దమ్మపేట: విద్యుత్ ఉద్యోగుల సంఘం (1104) ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నూతన కార్యవర్గాలను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దమ్మపేట మండలం పార్కలగండిలోని వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం నిర్వహించిన విద్యుత్ ఉద్యోగుల ఉమ్మడి జిల్లాస్థాయి కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా రమణారెడ్డి, శేషగిరిరావు, భద్రాద్రి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా హేమభద్రారావు, మోహన్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సాయిబాబుతో పాటు సుధీర్, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి పయనం

- 25ఏళ్లుగా హాజరవుతున్న ముస్లిం



మదార్‌సాహెబ్

కారేపల్లి: కారేపల్లికి చెందిన షేక్ మదార్ సాహెబ్ భద్రాచలంలో జరగనున్న శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి వీక్షించేందుకు మంగళవారం బయలుదేరాడు. గత 25ఏళ్లుగా కల్యాణాన్ని వీక్షిస్తున్న ఆయన తలనీలాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అంతేకాకుండా స్వామి ప్రసాదం తీసుకొచ్చి గ్రామస్తులకు అందజేస్తానని మదార్‌సాహెబ్ తెలిపారు.

అగ్నికి ఆహుతైన తాటివనం



మంటల్లో కాలిపోతున్న తాటిచెట్లు

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురంలో తాటివనానికి గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి నిప్పటించారు. ఒక్కసారిగా మంటలు ఎగిసి పడడంతో గుర్తించిన గీత కార్మికులు ఫైర్‌స్టేషన్‌ను సమాచారం ఇచ్చారు. అలాగే, మరికొందరు ఘటనాస్థలికి చేరకుని సమీపంలోని వాటర్ క్యాన్ల ద్వారా నిప్పు ఆర్పేందుకు ప్రయత్నించారు. అంతలోనే చేరకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే, అప్పటికే చాలాచెట్లు కాలిపోగా, తమ జీవనాధారమైన తాటిచెట్లకు నిప్పంటించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గీత కార్మిక సంఘం అధ్యక్షుడు గడ్డం కుమారస్వామిగౌడ్ ముదిగొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,050	2,050
పెసలు	8,525	4,000
కందులు	10,600	8,000
మినుములు	8,401	8,100
బొబ్బెర్లు	7,550	7,400
మిర్చి	20,000	9,500
తాలు మిర్చి	9,000	4,000
పత్తి	7,350	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,174

పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి



కలెక్టరేట్‌లో సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్‌దత్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి

- నామినేషన్ల స్వీకరణ సాఫీగా సాగాలి...
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సక్రమంగా, సాఫీగా సాగేలా సంబంధిత అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఖమ్మం లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశమయ్యారు. నామినేషన్ల స్వీకరణ సమయాన పరిశీలించాల్సిన పత్రాలు, అభ్యర్థులకు ఇవ్వాల్సిన సూచనలకు అధికారులకు వివరించారు. కాగా, కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్కల ద్వారా నామినేషన్ పత్రాలు నింపడం, జత చేయాల్సిన పత్రాలపై అభ్యర్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కాగా, కలెక్టరేట్‌లో భద్రతా ఏర్పాట్లను కలెక్టర్, సీపీ పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ సమయాన పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేయాలని, రిటర్నింగ్ అధికారి చాంబర్ నుండి 100 మీటర్ల పరిధిలో బందోబస్తు ఉండాలని తెలిపారు. ఆపై సీసీ కెమెరాలను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు.

విధులపై అవగాహన ఉండాలి

ఎన్నికల విధులపై ఉద్యోగులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్, 85ఏళ్ల పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్ సౌకర్యాన్ని కల్పించినందున అర్హులకు అవగాహన కల్పించాలన్నారు. ఆతర్వాత నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై నల్లగొండ జిల్లా కలెక్టర్ హరిచందన ఆధ్వర్యాన నిర్వహించని వీసీలో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్.. జిల్లాలో ఏర్పాట్లను వివరించారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్లు మాయంక్ సింగ్, యువరాజ్, మ్రినాల్ శ్రేష్ఠ, డీఆర్వో ఎం.రాజేశ్వరి, అదనపు డీసీపీ ప్రసాదరావు, డీసీఓ మురళీధర్‌రావు, జిల్లా ఉపాధికల్పన అధికారి కె.శ్రీరామ్, కలెక్టరేట్ ఏఓ అరుణ, ఏసీపీ రమణమూర్తి, జెడ్పీ సీఈఓ వినోద్, డీఆర్డీఓ సన్యాసయ్య, డీపీఓ విజయనిర్మలతో పాటు ఉద్యోగులు మదన్‌గోపాల్, రాంబాబు, పాల్గొన్నారు.

4గంటల తర్వాతే కలెక్టరేట్‌కు రండి

లోక్‌సభ ఎన్నికల నామినేషన్లు ఈనెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు కలెక్టరేట్‌లో స్వీకరించనున్నందున ఇతర దరఖాస్తులు ఇచ్చేందుకు సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు రావాలని కలెక్టర్ సూచించారు. మిగతా సమయంలో వచ్చి ఇబ్బంది పడొద్దని తెలిపారు.

ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు

రఘునాథపాలెం: ఎండలు పెరుగుతున్నందున ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో నీడ కోసం టెంట్లు వేయడమే కాకుండా తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. రఘునాథపాలెం మండలం మండలంలోని చెరువుకొమ్ము తండా, వేపకుంట్ల, గణేశ్వరంలో ఉపాధి పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పనుల వివరాలతో పాటు కూలీలకు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, డీపీఓ హరికిషన్, డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఏపీడీలు శిరీష, శ్రీదేవి, డీఎల్‌పీఓ కీర్తి ప్రభాకర్, ఎంపీడీఓ అశోక్ కుమార్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, వేపకుంట్లలోని చెరువు నుంచి తవ్విన మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ల డ్రైవర్లతో కలెక్టర్ మాట్లాడారు. మట్టి ఎక్కడకు తీసుకెళ్తున్నారని ఆరా తీయగా రైతుల పొలానికి అని చెప్పారు. దీంతో రైతును కూడా పిలిపించి నిజమేనా, కాదా అని ప్రశ్నించారు. ఎక్కడ కూడా మట్టి పక్కదారి పట్టకుండా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

అదుపు తప్పి డీజిల్ ట్యాంకర్ పల్టీ

- జాతీయ రహదారిపై వరదలా పారిన డీజిల్
- ఏసీపీ రఘు ఆధ్వర్యాన ఐదు గంటల పాటు రెస్క్యూ



ట్యాంకర్‌ను క్రేన్ సాయంతో నిలబెడుతున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: హైదరాబాద్ నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న డీజిల్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన సత్తుపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. సుమారు రూ.38 లక్షల విలువైన 26వేల లీటర్ల డీజిల్‌తో ట్యాంకర్ వస్తుండగా, డ్రైవర్ అతివేగంగా వెళ్తూ సత్తుపల్లి పోస్టాఫీస్ సెంటర్ వద్ద బ్రేక్ వేయగానే అదుపు తప్పి పడిపోయింది. బస్టాండ్ ఇన్‌గేట్ ఎదుట ఈ ఘటన జరగగా మధ్యాహ్నం ఎండ కారణంగా జనసంచారం లేకపోవడంతో ప్రాణహానీ తప్పింది. అయితే ట్యాంకర్ పడిన సమయాన పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. డ్రైవర్ అజయ్‌పాల్ గాయాలతో బయట పడటంతో ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన సత్తుపల్లిలో తీవ్ర ఆందోళన కలిగించింది.

ఐదు గంటలు సాగిన రెస్క్యూ

ట్యాంకర్ జాతీయ రహదారికి అడ్డంగా పడిపోయి అందులో నుంచి డీజిల్ రహదారిపై వరదలా పారటంతో అటుగా వెళ్లే వాహనదారులు జారి కింద పడ్డారు. దీంతో ఏసీపీ ఎ.రఘు, సీఐ టి.కిరణ్ సిబ్బందితో చేరుకొని ట్రాఫిక్‌ను మళ్లించడంతో పాటు ముందస్తుగా ఆ ప్రాంతంలోని దుకాణాలను మూసివేయించారు. అలాగే, అశ్వారావుపేట నుంచి చేరుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది డీజిల్‌పై ఫోమ్ స్ప్రే చేస్తుండగా, సింగరేణి నుంచి తెప్పించిన భారీ క్రేయిన్‌తో డీజిల్ ట్యాంకర్‌ను సరిచేశారు. ఆ సమయంలో మరోమారు పెద్ద శబ్దం రావడంతో అంతా ఉలిక్కిపడ్డారు. ఇక డీజిల్ పారిన రహదారిపై మున్సిపల్ సిబ్బందితో బ్లీచింగ్, ఇసుక ఊక చల్లించి పరిస్థితులు చక్కదిద్దారు. సుమారు ఐదు గంటల పాటు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, సింగరేణి ఉద్యోగులు, బెటాలియన్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది ఎర్రని ఎండలో చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్ విజయవంతం కావటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే కారణంతో ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ ఎస్.కే.అఫ్జల్‌హసన్, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఆర్.వీ.సాగర్ ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరించారని ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు అందింది. దీంతో విచారణ అనంతరం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వీరిద్దరిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

ఇంట్లోనే భార్య మృతి.. భర్త పరిస్థితి విషమం



పుష్పవతి మృతదేహం

కల్లూరు: కల్లూరు పట్టణానికి చెందిన దంపతులు మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో భార్య మృతి చెందగా, భర్త పరిస్థితి విషమంగా ఉంది. వివరాలిలా ఉన్నాయి. బియ్యం వ్యాపారి చల్లా నర్సింహారావు, ఆయన భార్య పుష్పవతి(40) ఇంట్లోనే పురుగుల మందు తాగారు. హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పావని, బీటెక్ పూర్తి చేసిన మరో కుమార్తె కావ్య పలుమార్లు ఫోన్ చేసినా తల్లిదండ్రులు స్పందించకపోవడంతో చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చారు. దీంతో ఇరుగు పొరుగు వచ్చి చూడగా పుష్పవతి అప్పగికే మృతి చెంది ఉండగా.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నర్సింహారావును ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఎస్‌కే.షాకీర్ చేరుకుని వివరాలు ఆరా తీశారు. అయితే, ఘటనకు కారణాలు తెలియాల్సి ఉంది.

చేతబడి పేరిట ఇద్దరిపై దాడి

పెనుబల్లి: మండలంలోని పార్థసారధిపురంలో చేతబడి చేశారంటూ ఇద్దరిపై దాడి జరిగింది. గ్రామానికి చెందిన కుంజ శివ దినకర్మ కార్యక్రమానికి అదే గ్రామానికి చెందిన బండి రాములు, పద్యం బాబురావు మంగళవారం వెళ్లారు. అయితే, వీరు చేతబడి చేయడంతోనే శివ చనిపోయాడంటూ ఆయన బంధువులు సున్నం పోతమ్మ, కుంజా రాములు, కుంజా వెంకటేష్, కుంజా లక్ష్మి, కుంజా జయమ్మ దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా కొట్టడంతో పాటు చేతుల్లో నిప్పులు పోసి, దంతాలు ఊడపీకడానికి ప్రయత్నించారని బాధితులు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అకౌంట్లు హ్యాక్ చేసి నగదు స్వాహా

పెనుబల్లి: మండలంలోని వీఎం.బంజర్ గ్రామానికి చెందిన కొణిజేటి తిరుపతిస్వామి ఫోన్‌కు లింక్ అయిన రెండు అకౌంట్లను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు నగదు స్వాహా చేశారు. తిరుపతిస్వామి రెండు అకౌంట్లను హ్యాక్ చేసి రూ.1.80 లక్షలు నేరగాళ్లు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైతులు యాజమాన్య పద్ధతులు అవలంబించాలి

బోనకల్: పంటల సాగులో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే మంచి ఫలితాలు వస్తాయని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయనిర్మల తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం జరిగిన రైతునేస్తం కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంటల సాగులో మెళకువలపై అవగాహన కల్పించాక డీఏఓ మాట్లాడారు. రైతులకు తమ పొలాల్లోని మట్టి నమూనా పరీక్షలు చేయించుకుని ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేయాలని సూచించారు. మధిర ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓలు సరిత, నాగయ్య, రాధ, శ్రీనివాసరావు, విజయ్‌బాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

- ఏడు నెలల క్రితమే వివాహం



అభిలాష్ (ఫైల్)

రఘునాథపాలెం: సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం చేస్తున్న యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. ఉగాది పండుగకు స్వస్థలానికి వచ్చిన ఆయన మృత్యువాత పడగా కుటుంబంలో విషాదం నెలకొంది. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంకు చెందిన ఎస్.అభిలాష్(30) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, ఏడు నెలల క్రితం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న యువతితో వివాహం జరిగింది. వీరిద్దరు ఉగాది పండుగకు వీ.వీ.పాలెం వచ్చారు. పండుగ తర్వాత ఆయన భార్య హైదరాబాద్ వెళ్లిపోగా.. అభిలాష్ మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో బాత్‌రూంకు వెళ్లి వచ్చి మంచంపై కుప్పకూలాడు. దీంతో కుటుంబీకులు చూసేలోగా గుండెపోటుతో మృతి చెందినట్లు తేలింది. ఈమేరకు ఆయన తల్లిదండ్రులు రామలక్ష్మి, భిక్షంతో పాటు కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

సాక్షి బిజినెస్
బుధవారం
17-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	456	72,944
నిఫ్టీ ▽	125	22,148

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	15,899	△ 13
డోజోన్స్	37,857	△ 122
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,166	△ 89
డాక్స్	15,509	△ 328
షాంఘై	3,007	▽ 50
నికాయ్	38,471	▽ 762

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	73,302	△1,488
బంగారం (99.5 స్వచ్ఛత)	73,008	△1,487
వెండి (కేజీ)	83,213	▽ 239

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.04	84.06
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.56	106.76
€	యూరో	ఎస్‌బీఐ	87.82	90.16
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.77	54.97
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.20	55.12
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.26	63.40
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.37	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.84	23.58
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.40	12.38

ఎంఎఫ్ ఆస్తులు రూ. 53.4 లక్షల కోట్లు

- 2023–24లో 35 శాతం జూమ్
- వార్షికంగా రూ. 14 లక్షల కోట్ల జమ
- 17.78 కోట్లకు ఫోలియోల సంఖ్య



న్యూఢిల్లీ: దేశీయంగా మ్యూచువల్ ఫండ్స్(ఎంఎఫ్‌లు) ఆస్తులు గత ఆర్థిక సంవత్సరం(2023–24)లో 35% జంప్ చేశాయి. రూ. 53.4 లక్షల కోట్లను తాకాయి. వార్షికంగా రూ. 14 లక్షల కోట్లమేర ఎగశాయి. ఇందుకు ప్రధానంగా రిటైల్ ఇన్వెస్టర్ల పెట్టుబడులు, లాభాల పరుగు తీస్తున్న ఈక్విటీ మార్కెట్లు ప్రభావం చూపాయి. వెరసి 2020–21 ఏడాది(41 శాతం వృద్ధి) తదుపరి గరిష్టస్థాయిలో ఎంఎఫ్ ఆస్తులు బలపడినట్లు వార్షిక నివేదికలో ఫండ్స్ దేశీ అసోసియేషన్(యాంఫి) వెల్లడించింది. ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల(ఏయూఎం) పురోగతి.. ఫండ్స్ పరిశ్రమలో పెరుగుతున్న ఇన్వెస్టర్లను ప్రతిబింబిస్తున్నట్లు పేర్కొంది. ఫలితంగా మార్చి చివరికల్లా ఫోలియోల సంఖ్య 17.78 కోట్లను తాకింది. ఇది సరికొత్త రికార్డు కాగా.. ఇన్వెస్టర్ల బేస్ 4.46 కోట్లకు చేరింది. ఇన్వెస్టర్ల సంఖ్యలో మహిళల వాటా 23 శాతంకావడం గమనార్హం!

సిప్ దన్ను

క్రమబద్ధ పెట్టుబడుల(సిప్) పథకాలను ఇన్వెస్టర్లు ఆదరిస్తుండటంతో వీటి సంఖ్య బలపడుతోంది. దీంతో నెలవారీ నికర పెట్టుబడులు మార్చిలో రూ. 19,300 కోట్లకు చేరాయి. పూర్తి ఏడాదిలో సిప్ పథకాల ద్వారా రూ. 2 లక్షల కోట్ల నికర పెట్టుబడులు లభించాయి. ఇది ఇన్వెస్టర్లలో పెరుగుతున్న ఆసక్తిని పట్టిచూపుతోంది. అంతేకాకుండా క్రమశిక్షణతోకూడిన పెట్టుబడులను ప్రతిబింబిస్తోంది. దేశీ ఎంఎఫ్ పరిశ్రమకు గతేడాది మైలురాయివంటిదని యాంఫి నివేదిక పేర్కొంది. ఏయూఎం చెప్పుకోదగ్గవిధంగా రూ. 14 లక్షల కోట్లమేర పెరిగి సరికొత్త రికార్డ్ నెలకొల్పుతూ రూ. 53.4 లక్షల కోట్లకు చేరినట్లు వివరించింది. 2022–23లో ఫండ్స్ ఏయూఎం విలువ రూ. 39.42 లక్షల కోట్లు మాత్రమేనని ప్రస్తావించింది. ఈక్విటీ, హైబ్రిడ్, సొల్యూషన్ ఆధారిత పథకాలు తదితరాలలో ప్రధానంగా రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా ఇన్వెస్ట్ చేసినట్లు పేర్కొంది. పరిశ్రమ ఆస్తుల్లో వీటి వాటా 58 శాతంకాగా.. ఫోలియో సంఖ్యలో 80 శాతాన్ని ఆక్రమిస్తున్నట్లు వెల్లడించింది. ఇవన్నీ ఎంఎఫ్‌ల ద్వారా క్యాపిటల్ మార్కెట్లలో పెరుగుతున్న కుటుంబ మదుపును ప్రతిబింబిస్తున్నట్లు తెలియజేసింది.

ఈక్విటీకే ఓటు

గతేడాది పెట్టుబడుల్లో ఈక్విటీ ఆధారిత పథకాలు 55 శాతం వృద్ధిని అందుకుని ఆస్తులలో రూ. 23.5 లక్షల కోట్లకు చేరాయి. ఇందుకు పెట్టుబడులతో పాటు.. మార్క్‌టు మార్కెట్(ఎంటుఎం) లాభాలు సహకరించాయి. అయితే మరోవైపు రుణ పథకాల ఫండ్స్ 7 శాతమే బలపడ్డాయి. ఏయూఎంలో రూ. 12.62 లక్షల కోట్లకు చేరాయి. అయినప్పటికీ అంతక్రితం రెండేళ్లలో ఆస్తులు తగ్గుతూ వచ్చిన అంశంతో పోలిస్తే మెరుగేనని నివేదిక తెలియజేసింది.

మూడోరోజూ పతనమే

- సెన్సెక్స్ 456 పాయింట్లు డౌన్
- నిఫ్టీ 125 పాయింట్ల క్షీణత
- మూడు వారాల దిగువకు సూచీలు
- శ్రీరామ నవమి సందర్భంగా నేడు ఎక్స్ఛేంజీలకు సెలవు



ముంబై: పశ్చిమాసియాలోని ఉద్రిక్తతలు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో బలహీన సంకేతాలతో స్టాక్ సూచీలు మూడో రోజూ నష్టాలు చవిచూశాయి. ఐటీ, మెటల్, బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 456 పాయింట్లు నష్టపోయి 72,944 వద్ద నిలిచింది. నిఫ్టీ 125 పాయింట్లు కోల్పోయి 22,148 వద్ద స్థిరపడింది. ఇవి 3 వారాల కనిష్ట స్థాయిలు కాగా.. నష్టాలతో మొదలైన సూచీలు ప్రథమార్థమంతా తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 715 పాయింట్లు నష్టపోయి 72,685 వద్ద, నిఫ్టీ 147 పాయింట్లు క్షీణించి 22,125 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. అయితే మిడ్‌సెషన్ నుంచి ఇంధన, ఆయిల్, విద్యుత్, వినిమయ, పారిశ్రామిక, కన్జూమర్ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు దాదాపు సగం నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ సూచీలు 0.57%, 0.05% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.4,468 కోట్ల ఈక్విటీలు అమ్మేయగా, డీఐఐలు రూ.2,040 కోట్ల షేర్లను కొనుగోలు చేశాయి.

- ➤ శ్రీరామ నవమి సందర్భంగా నేడు (బుధవారం) బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలకు సెలవు. బులియన్, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. కమోడిటీ మార్కెట్లు మాత్రం సాయంత్రం సెషన్‌లో పనిచేస్తాయి.
- ➤ అమెరికా వడ్డీ రేట్ల వాయిదా అంచనాలతో ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఇన్ఫోసిస్ 4%, ఎంఫసీస్ 3.50%, కోఫోర్జ్ 3%, పర్‌సిస్టెంట్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, టీసీఎస్ షేర్లు రెండుశాతం చొప్పున నష్టపోయాయి.
- ➤ వెల్త్‌మేనేజ్‌మెంట్, బ్రోకింగ్ కంపెనీల ఏర్పాటుకు బ్లాక్‌రాక్‌తో ఒప్పందం చేసుకోవడంతో జియో ఫైనాన్సియల్ సర్వీసెస్ షేరు 2% లాభపడి రూ.362 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 5% ఎగసి రూ.372 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది. కంపెనీ మార్కెట్ విలువ రూ.4,733 కోట్లు పెరిగి రూ.2.30 లక్షల కోట్లకు చేరింది.
- ➤ సెన్సెక్స్ మూడు రోజుల్లో 2,094 పాయింట్ల పతనంతో బీఎస్‌ఈలో మార్కెట్ విలువలో రూ.7.93 లక్షల కోట్లు మాయమయ్యాయి.

రికార్డు కనిష్టానికి రూపాయి

- 83.61కి దేశీ కరెన్సీ విలువ

డాలర్ మారకంలో రూపాయి విలువ 17 పైసలు నష్టపోయి జీవితకాల కనిష్ట స్థాయి 83.61 వద్ద ముగిసింది. ఇరాన్–ఇజ్రాయిల్ యుద్ధ ఉద్రిక్తతలతో ఆరు ప్రధాన కరెన్సీ విలువల్లో డాలర్ 5 నెలల గరిష్టానికి బలపడటం ప్రధాన కారణం. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 83.51 వద్ద మొదలైంది. రోజంతా నష్టాల్లో కదలాడి ఇంట్రాడే కనిష్టం(83.61) వద్ద స్థిరపడింది. ఈ ఏడాది మార్చి 22న ఇదే స్థాయి(83.61) వద్ద జీవితకాల కనిష్టాన్ని తాకింది. వెరసి గడిచిన నాలుగు వారాల్లో దేశీయ కరెన్సీ రెండోసారి జీవితకాల కనిష్టాన్ని నమోదు చేయడం గమనార్హం.

మళ్లీ మెరిసిన పసిడి, వెండి

బంగారం కొత్త రికార్డు రూ. 73,750

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల భయాలతో పసిడి, వెండి పరుగు కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలోని ధోరణులకు తగ్గట్లు దేశీయంగా వెండి, బంగారం ధరలు మంగళవారం మరో రికార్డు స్థాయిని తాకాయి. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ ప్రకారం దేశ రాజధానిలో ఉదయం పసిడి 10 గ్రాముల ధర రూ. 700 పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి అయిన రూ. 73,750ని తాకింది. అదే విధంగా వెండి ధర కూడా కేజీకి రూ. 800 పెరిగి రూ. 86,500 స్థాయిని తాకింది. ఎంసీఎక్స్‌లో జూన్ కాంట్రాక్టు ధర ఇంట్రా–డేలో రూ. 72,927 స్థాయిని తాకింది. అంతర్జాతీయ మార్కెట్లు చూస్తే కామెక్స్‌లో ఔన్సు (31.1 గ్రాముల) పసిడి ధర 15 డాలర్లు పెరిగి 2,370 వద్ద ట్రేడయ్యింది. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగినంత కాలం బంగారం బులిష్‌గానే ఉండనున్నట్లు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది తెలిపారు.




కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-4-2024 ఫామ్ ధర...

విశాఖ	419-00
చిత్తూరు	483-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	404-00
విజయవాడ	404-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

క్రిసిల్ క్యూ1 లాభం డౌన్

షేరుకి రూ. 7 డివిడెండ్



న్యూఢిల్లీ: రేటింగ్ దిగ్గజం క్రిసిల్ ఈ ఆర్థిక సంవత్సరం(2024) తొలి త్రైమాసికం(క్యూ1)లో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చిలో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 శాతంపైగా క్షీణించి రూ. 138 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023) ఇదే కాలం(క్యూ1)లో రూ. 146 కోట్లు ఆర్జించింది. కంపెనీ కేలండర్ ఏడాదిని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. అయితే మొత్తం ఆదాయం నామమాత్ర వృద్ధితో రూ. 751 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ1లో రూ. 732 కోట్ల టర్నోవర్ సాధించింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 539 కోట్ల నుంచి రూ. 563 కోట్లకు స్వల్పంగా పెరిగాయి. గతేడాది(2023)కిగాను కంపెనీ బోర్డు షేరుకి రూ. 7 చొప్పున వాటాదారులకు మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. మే 14న డివిడెండ్ చెల్లించనుంది. కాగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లో జీడీపీ 6.8 శాతం వృద్ధిని సాధించవచ్చని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది.

క్రిసిల్ షేరు 3% తగ్గి రూ. 4,700 వద్ద ముగిసింది.

సోనీతో విలీనంపై జీ పిటిషన్ ఉపసంహరణ

న్యూఢిల్లీ: సోనీతో విలీన ప్రతిపాదన అమలయ్యేలా ఆదేశాలివ్వాలంటూ ఎన్‌సీఎల్‌టీలో దాఖలు చేసిన పిటిషన్‌ను జీ ఎంటర్‌టైన్‌మెంట్ (జీల్) ఉపసంహరించుకుంది. న్యాయ నిపుణుల సలహా మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. షేర్‌హోల్డర్లకు మరింత విలువ చేకూర్చే అవకాశాలను ఉపయోగించుకోవడంపై, సోనీపై ఆర్బిట్రేషన్ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించడంపై దృష్టి పెట్టనున్నట్లు పేర్కొంది. సోనీ భారత వ్యాపార విభాగం, జీల్ విలీనంపై కొన్నాళ్లుగా కసరత్తు జరిగినప్పటికీ ఒప్పందం కుదరని సంగతి తెలిసిందే.

జ్యువెలరీ వ్యాపారంలోకి ఆదిత్య బిర్లా గ్రూప్

- రూ. 5 వేల కోట్ల పెట్టుబడుల ప్రణాళికలు
- ఏబీసీ డిజిటల్ సూపర్ యాప్ ఆవిష్కరణ



ముంబై: ఆదిత్య బిర్లా గ్రూప్ కొత్తగా జ్యువెలరీ రిటైల్ వ్యాపారంలోకి అడుగుపెట్టనుంది. ఇందుకోసం రూ. 5,000 కోట్ల మేర ఇన్వెస్ట్ చేయనుంది. మంగళవారం ఆదిత్య బిర్లా క్యాపిటల్ డిజిటల్ (ఏబీసీడీ) సూపర్ యాప్‌ను ఆవిష్కరించిన సందర్భంగా సంస్థ చైర్మన్ కేఎం బిర్లా ఈ విషయాలు వెల్లడించారు. ఆదిత్య బిర్లా గ్రూప్ ఈ మధ్యే పెయింట్స్ వ్యాపారంలోకి కూడా ప్రవేశించిన సంగతి తెలిసిందే. మరోవైపు, డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా వచ్చే మూడేళ్లలో 3 కోట్ల మంది పైగా కొత్త కస్టమర్లను చేర్చుకోవాలని నిర్దేశించుకున్నట్లు బిర్లా వివరించారు. ప్రస్తుతం రుణాలు, బీమా, అసెట్ మేనేజ్‌మెంట్ తదితర వ్యాపార విభాగాల ద్వారా ఆదిత్య బిర్లా క్యాపిటల్ సుమారు 3.5 కోట్ల మంది కస్టమర్లకు సేవలు అందిస్తోంది. సూపర్ యాప్‌లో 22 ఉత్పత్తులు, సర్వీసులు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

భవిత

జాబ్ పాయింట్

ఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎస్‌ఎఫ్‌లో 4,660 పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్‌ఆర్‌బీ).. దేశవ్యాప్తంగా అన్ని రైల్వే రీజియన్లలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్), రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్(ఆర్‌పీఎస్‌ఎఫ్)లో సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్‌ఐ), కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 4,660
- » పోస్టుల వివరాలు: సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్‌ఐ)–452, కానిస్టేబుల్–4208.
- » ఆర్‌ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీఘడ్, చెన్నై, గోరఖ్‌పూర్, గువాహటి, జమ్మూ–శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబై, ముజఫర్‌పూర్, పాట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం.
- » అర్హత: కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి, ఎస్‌ఐ ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- » వయసు: 01.07.2024 నాటికి కానిస్టేబుల్ పోస్టులకు 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్‌ఐ పోస్టులకు 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- » ప్రారంభ వేతనం: నెలకు ఎస్‌ఐ పోస్టులకు రూ.35,400. కానిస్టేబుల్ పోస్టులకు 21,700
- » ఎంపిక విధానం: రాతపరీక్ష(సీబీటీ), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, మెడికల్ స్టాండర్డ్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 15.04.2024
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:14.05.2024
- » పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://rpf.indianrailways.gov.in

సింగేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, కొత్తగూడెంలో 327 ఉద్యోగాలు

తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్).. వివిధ విభాగాల్లో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 327

పోస్టుల వివరాలు

- » ఎగ్జిక్యూటివ్ కేడర్: మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఈ–ఎం), ఈ2 గ్రేడ్–42, మేనేజ్‌మెంట్ ట్రైనీ(సిస్టమ్స్), ఈ2 గ్రేడ్–07.
- » నాన్–ఎగ్జిక్యూటివ్ కేడర్: జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ(జేఎంఈటీ), టీ–ఎస్ గ్రేడ్ సి–100, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ(మెకానికల్), టీ–ఎస్ గ్రేడ్ సి–09, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ(ఎలక్ట్రికల్), టీ–ఎస్ గ్రేడ్ సి–24, ఫిట్టర్ ట్రైనీ, క్యాట్ 1–47,ఎలక్ట్రీషియన్ ట్రైనీ, క్యాట్ 1–98.
- » అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
- » వయసు: గరిష్ట వయసు 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 15.04.2024
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:04.05.2024
- » పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://scclmines.com

ఇండియన్ ఆర్మీలో టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు

ఇండియన్ ఆర్మీ 140 టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడెమీలో 2025లో ప్రారంభమయ్యే కోర్సులో ప్రవేశం కల్పిస్తారు. అవివాహిత పురుష అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 30 (140వ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు)
- » కోర్ ఇంజనీరింగ్ స్ట్రీమ్: సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఇతర ఇంజనీరింగ్ స్ట్రీమ్స్.
- » అర్హతలు: సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు లేదా కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- » వయసు: 01.01.2025 నాటికి 20–27 ఏళ్ల మధ్య ఉండాలి.
- » ఎంపిక విధానం: అప్లికేషన్ల షార్ట్ లిస్టింగ్, స్టేజ్1, స్టేజ్ 2 టెస్టులు, ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ టెస్టుల ఆధారంగా ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి 12 నెలలపాటు డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడెమీలో శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో లెఫ్ట్‌నెంట్ ర్యాంకుతో షార్ట్ సర్వీస్ కమిషన్ లభిస్తుంది. శిక్షణ అనంతరం పర్మనెంట్ కమిషన్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- » దరఖాస్తులకు చివరి తేది: 09.05.2024
- » వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in/Authentication.aspx

ఆర్థిక, గణాంక కొలువుల పిలుపు

- » మొత్తం 48 పోస్టులతో ఐఈఎస్/ ఐఎస్‌ఎస్ నోటిఫికేషన్
- » రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో ప్రతిభ ఆధారంగా ఎంపిక
- » ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్‌లో పీజీ, డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు

కేంద్ర సర్వీసుల్లో ఉన్నత కొలువులు కోరుకునే యువతకు మరో చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! యూపీఎస్సీ.. ఐఈఎస్, ఐఎస్‌ఎస్–2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా జూనియర్ టైమ్ స్కేల్‌తో.. పలు శాఖల్లో.. అసిస్టెంట్ డైరెక్టర్, రీసెర్చ్ ఆఫీసర్ హోదాలో కొలువుదీరొచ్చు!! ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్‌లో పీజీ, బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో ఈ ఉన్నత స్థాయి పోస్టులకు పోటీ పడొచ్చు. ఈ నేపథ్యంలో ఐఈఎస్, ఐఎస్ఎస్ పోస్టుల వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

ఐఈఎస్/ఐఎస్‌ఎస్

ఐఈఎస్.. ఇండియన్ ఎకనామిక్ సర్వీస్. ఐఎస్‌ఎస్..ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖల ఆర్థిక సంబంధ కార్యకలాపాల సమర్థ నిర్వహణకు అవసరమైన నిపుణుల ఎంపికకు యూపీఎస్సీ ప్రతిఏటా నిర్వహించే పరీక్ష.. ఐఈఎస్/ఐఎస్‌ఎస్.

మొత్తం 48 పోస్టులు

యూపీఎస్సీ తాజాగా విడుదల చేసిన ఐఈఎస్/ఐఎస్‌ఎస్–2024 నోటిఫికేషన్ ద్వారా రెండు విభాగాల్లో కలిపి మొత్తం 48 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌లో 18 పోస్టులు, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్‌లో 30 పోస్టులు ఉన్నాయి.

విద్యార్హత

- ఐఈఎస్: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్/అప్లైడ్ ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్/ఎకనోమెట్రిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉండాలి.
- ఐఎస్‌ఎస్: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి స్టాటిస్టిక్స్/మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా డిగ్రీ లేదా ఈ సబ్జెక్టులు స్పెషలైజేషన్‌గా పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
- వయసు: 2024, ఆగస్టు 1 నాటికి అభ్యర్థి వయసు 21–30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్ల చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

ఐఈఎస్, ఐఎస్‌ఎస్ ఎంపిక ప్రక్రియ రెండు దశలుగా ఉంటుంది. మొదటి దశలో వేయి మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

రాత పరీక్షలు వేర్వేరుగా

ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్ష ఐఈఎస్, ఐఎస్‌ఎస్ అభ్యర్థులకు వేర్వేరుగా ఉంటుంది.

వెయి మార్కులకు ఐఈఎస్ రాత పరీక్ష

ఐఈఎస్ రాత పరీక్ష ఆరు పేపర్లలో మొత్తం 1,000 మార్కులకు జరుగుతుంది. అవి.. పేపర్–1 జనరల్ ఇంగ్లిష్ 100 మార్కులు, పేపర్–2 జనరల్ స్టడీస్ 100 మార్కులు, పేపర్–3 జనరల్ ఎకనామిక్స్–1, 200 మార్కులు; పేపర్–4 జనరల్ ఎకనామిక్స్–2, 200 మార్కులు; పేపర్–5 జనరల్ ఎకనామిక్స్–3, 200 మార్కులు; పేపర్–6 ఇండియన్ ఎకనామిక్స్ 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఐఈఎస్ పరీక్ష పేపర్లన్నీ పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలోనే ఉంటాయి. ప్రతి పేపర్‌కు పరీక్ష సమయం మూడు గంటలు.

ఐఎస్‌ఎస్.. రాత పరీక్ష ఇలా

ఐఈఎస్‌తో పోల్చితే.. ఐఎస్‌ఎస్ రాత పరీక్ష కొంత భిన్నంగా ఉంటుంది. ఇందులో ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ ప్రశ్నలతో పేపర్లు ఉంటాయి. అవి..పేపర్–1 జనరల్ ఇంగ్లిష్–100 మార్కులు, పేపర్–2 జనరల్ స్టడీస్–100 మార్కులు, పేపర్–3 స్టాటిస్టిక్స్–1(ఆబ్జెక్టివ్), 200 మార్కులు; పేపర్–4 స్టాటిస్టిక్స్–2(ఆబ్జెక్టివ్), 200 మార్కులు; పేపర్–5 స్టాటిస్టిక్స్–3, 200 మార్కులు; పేపర్–6 స్టాటిస్టిక్స్–4, 200 మార్కులకు ఉంటాయి. మొత్తం 1000 మార్కులకు పరీక్ష ఉంటుంది. పేపర్ 3,4 తప్ప మిగతా పేపర్లు డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటాయి. ఆబ్జెక్టివ్ పేపర్లకు రెండు గంటలు, డిస్క్రిప్టివ్ పేపర్లకు మూడు గంటల సమయం అందుబాటులో ఉంటుంది.

పర్సనల్ ఇంటర్వ్యూ

రాత పరీక్షలో చూపిన ప్రతిభ, పోస్టుల సంఖ్య, రిజర్వేషన్లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. ఇందులో చోటు సంపాదించిన వారికి మలిదశలో చివరగా 200 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులోనూ ప్రతిభ చూపితే.. రాత పరీక్షలో మార్కులు, ఇంటర్వ్యూ మార్కులను క్రోడీకరించి తుది విజేతలను ఖరారు చేసి ఆయా సర్వీసులకు ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, ఏప్రిల్ 30
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ: 2024, మే 1 నుంచి 7 వరకు
- పరీక్ష తేదీలు: 2024, జూన్ 21 నుంచి
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్
- వెబ్‌సైట్: www.upsc.gov.in

రాత పరీక్షలో రాణించేలా

ఐఈఎస్, ఐఎస్‌ఎస్ పరీక్షల్లో విజయం సాధించేందుకు అభ్యర్థులు అకడమిక్‌గా పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయడం ఉపకరిస్తుంది. అదే విధంగా ప్రీవియస్ పేపర్లు, మోడల్ పేపర్ల సాధన కూడా కలిసొస్తుంది.

జనరల్ ఇంగ్లిష్

ఐఈఎస్, ఐఎస్‌ఎస్ రెండు సర్వీసులకు ఉమ్మడిగా ఉండే పేపర్ ఇది. ఇందులో ప్రశ్నల క్లిష్టత బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో ఉంటుంది. ఇందులో ఒక ఎస్సే రాయాల్సి ఉంటుంది. ఒకాబ్యులరీని, రీడింగ్‌కాంప్రహెన్షన్ టెక్నిక్స్‌ను పెంచుకోవాలి. ఇంగ్లిష్‌లో ఎక్కువగా ప్యాసేజ్ రైటింగ్, ప్రెసిస్ రైటింగ్ ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ స్టడీస్

ఈ పేపర్ కూడా రెండు సర్వీసులకు ఒకే మాదిరిగా ఉంటుంది. ఎక్కువగా కరెంట్ ఈవెంట్స్, జనరల్ నాలెడ్జ్ నుంచి ప్రశ్నలు అడిగే అవకాశముంది. శాస్త్ర సాంకేతిక రంగం, భారత రాజ్యాంగం, భారత దేశ చరిత్ర, జాగ్రఫీలపై పట్టు సాధించాలి.

జనరల్ ఎకనామిక్స్–1

ఇందులో రాణించడానికి సూక్ష్మ అర్థశాస్త్రం, మ్యాథమెటిక్స్, స్టాటిస్టికల్ ఎకనోమెట్రిక్ మెథడ్స్‌పై పట్టు సాధించాలి. సూక్ష్మ అర్థశాస్త్రానికి సంబంధించి వినియోగదారుని డిమాండ్ సిద్ధాంతం, ఉత్పత్తి సిద్ధాంతం, విలువ, పంపిణీ అంశాలు తెలుసుకోవాలి. అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ఉండే ఈ పేపర్ కోసం లారెంజ్ వక్ర రేఖ, ఏంజెల్ సూత్రం, పారెటో పంపిణీ సిద్ధాంతం, స్వల్పకాల–దీర్ఘకాల వ్యయ రేఖలు, తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ ఎకనామిక్స్–2

స్థూల అర్థశాస్త్రం, ఎకనామిక్స్ ఆఫ్ డెవలప్‌మెంట్ అండ్ ప్లానింగ్, అంతర్జాతీయ అర్థశాస్త్రం తదితర అంశాల కలయికగా ఉండే పేపర్ ఇది. దీనికోసం ప్రతి అంశాన్ని వర్తమాన పరిస్థితులకు అన్వయిస్తూ చదువుకోవాలి. జాతీయాదాయం కొలమానం, గ్రీన్ నేషనల్ ఇన్‌కమ్, సంప్రదాయ ఉద్యోగితా సిద్ధాంతం, ఫిలిప్స్ రేఖ, ద్రవ్యరాశి సిద్ధాంతం వంటి కీలక అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ప్రపంచ వాణిజ్య సంక్షోభాలు–కారణాలు,ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐఎంఎఫ్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల తాజా కార్యకలాపాలపైనా దృష్టి పెట్టాలి.

జనరల్ ఎకనామిక్స్–3

ఇందులో ప్రభుత్వ విత్త శాస్త్రం, పర్యావరణ అర్థశాస్త్రం, ఇండస్ట్రియల్ ఎకనమిక్స్ అంశాలు సమ్మిళితంగా ఉంటాయి. ఈ పేపర్‌లో మంచి మార్కుల కోసం పన్ను సంస్కరణలు, గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతం, ప్రభుత్వ వ్యయ సిద్ధాంతం, గ్రీన్ జీడీపీ, ఇండస్ట్రియల్ ఎకనమిక్స్ తదితర అంశాలపై అవగాహన పొందాలి.



ఐఈఎస్, ఐఎస్‌ఎస్-2024

ఇండియన్ ఎకనామిక్స్

సిలబస్‌లోని ముఖ్యాంశాలను వర్తమాన పరిస్థితులకు అన్వయిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. స్థిరీకరణ–నిర్మాణాత్మక సర్దుబాటు ప్యాకేజీ, విత్తరంగ సంస్కరణలు, నీతి ఆయోగ్ సిఫార్సులు, టోకు ధరల సూచీ-రిటైల్ ధరల సూచీ, భారత ద్రవ్య మార్కెట్, ఎఫ్‌డీఐ, డిజిన్వెస్ట్‌మెంట్ పాలసీ తదితర తాజా అంశాలపై దృష్టి సారించాలి.

సబ్జెక్ట్ పేపర్లకు సన్నద్ధత ఇలా

- స్టాటిస్టిక్స్–1 పేపర్‌లో రాణించాలంటే.. పలు సిద్ధాంతాలపై పట్టు సాధించాలి. స్టాటిస్టికల్ మెథడ్స్, న్యూమరికల్ అనాలిసిస్ వంటి అంశాలపై అవగాహన పొందాలి.
- స్టాటిస్టిక్స్–2 పేపర్‌లో.. లీనియర్ మోడల్స్, ఎస్టిమేషన్, హైపోథిసిస్ టెస్టింగ్, మల్టీవెరైటీ అనాలిసిస్(ఎస్టిమేషన్ ఆఫ్ మీన్ వెక్టార్ అండ్ కో వేరియన్స్ మ్యాట్రిక్స్ తదితర అంశాలపై దృష్టిసారించాలి.
- స్టాటిస్టిక్స్–3 పేపర్‌లో.. శాంప్లింగ్ టెక్నిక్స్, ఎకనామిక్ సాటిస్టిక్స్, డిజైన్ అండ్ అనాలిసిస్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంట్స్, ఎకనోమెట్రిక్స్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- స్టాటిస్టిక్స్–4 పేపర్‌లో.. స్టాటిస్టికల్ క్వాలిటీ కంట్రోల్ అండ్ ఆపరేషన్స్ రీసెర్చ్ ,డెమోగ్రఫీ అండ్ వైటల్ ఛార్ట్స్, కంప్యూటర్ సిస్టమ్–సాఫ్ట్‌వేర్ కాన్సెప్ట్స్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ వంటి కంప్యూటర్ సంబంధ అంశాలపై పట్టుసాధించాలి.
- డేటా ఆధారిత అంశాలు అధికంగా ఉండే స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్ పేపర్లలో మంచి స్కోర్ చేయాలంటే.. వేగంతోపాటు కచ్చితత్వం, సునిశిత పరిశీలన అవసరం. ప్రిపరేషన్ సమయంలోనే ప్రతి అంశాన్ని నిర్దిష్ట కాలపరిమితి విధించుకుని చదవాలి. ముఖ్యంగా ఆయా సిద్ధాంతాలు, వాటిని వినియోగించి డేటా రూపకల్పన, ఛార్ట్స్, గ్రాఫ్స్ రూకల్పన వంటి అంశాలపై పట్టు సాధించాలి.